రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 10: ఎల్లారెడ్డి మండల సమీపంలోని రామలింగం బావి ప్రాంతంలో ఎల్లారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారి రోడ్డు మధ్యలో భారీ గుంత పడి ప్రమాదాలు సంభవిస్తున్నందున ఎల్లారెడ్డి పోలీసులు స్పందించి శనివారం రోడ్డుపై ఉన్న గుంతలలో మొరం పోసి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు వాహనాలపై వెళ్లే ముందు రోడ్లపై ఉన్న గుంతలను చూసి అప్రమత్తంగా వెళ్లాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్, ఏఎస్ఐ విజయ, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌పై.. ఆశలు!



- కొత్త కార్డుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం
- విధి విధానాలు ఖరారు అయితే దరఖాస్తులు స్వీకరించే అవకాశం
- జిల్లాలో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అర్హులు
- జిల్లాలో 53 శాతం కుటుంబాలకే కార్డులు

కామారెడ్డి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అర్హులైన అనేక మంది రేషన్‌కార్డుల కోసం వెయ్యికండ్లతో ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఇది వరకే ఆమోదం తెలుపడంతో పాటు సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. తాజాగా సబ్ కమిటీ సమావేశం అయింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సబ్ కమిటీ సమావేశమై పలు విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. రేషన్‌కార్డుల కోసం గ్రామాల్లో అయితే వార్షికాదాయం రూ.లక్షన్నర, పట్టణ ప్రాంతాల ప్రజలైతే వార్షిక ఆదాయం రూ.2లక్షల లోపు ఉన్నవారైతే అర్హులుగా తీసుకోవాలని కమిటీ ప్రతిపాదించింది. అయితే కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఎప్పుడు తీసు కోవాలనే దానిపై ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది. ఇది వరకే రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులకు సైతం దరఖాస్తులు స్వీకరించారు. వాటితో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్న నేపథ్యంలో కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాలో 2.53 లక్షలు మాత్రమే రేషన్‌కార్డులు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2.53 లక్షలు మాత్రమే రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహారభద్రత కార్డులు 2,34,743 ఉండగా అంత్యోదయ ఆహారభద్రత కార్డులు 17,655 ఉన్నాయి. అన్నపూర్ణకార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు మొత్తం 8.59 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్‌కార్డు ఆధారంగానే ఆయా కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు మంజూరు చేస్తూ వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కొన్ని పథకాలకు మాత్రమే రేషన్‌కార్డును ప్రామాణికంగా చేశాయి. ఆ ప్రభుత్వం కొత్త స్కీంలు తీసుకువచ్చినప్పటికీ పలు స్కీంలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోలేదు. ఇదే నేపథ్యంలో రేషన్‌కా ర్డుల కోసం గత 10ఏళ్లలో అర్హులైన లబ్ధిదారులు దరఖా స్తులు చేసుకున్నా మోక్షం లభించలేదు. ప్రభుత్వం సైతం దర ఖాస్తులను పెండింగ్‌లోనే ఉంచింది.

కార్డులు లేని కుటుంబాలు లక్షకు పైగానే

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 21,85,539 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సుమారు రేషన్‌కార్డులు లేని దారిద్రరేఖకు దిగువన ఉన్న లక్షకు పైగానే ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలకు రేషన్‌కార్డే ప్రామాణికంగా తీసుకుంటున్నందున సదరు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 2,53,305 తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కంపల్సరీగా ప్రకటించడంతో తెల్లరేషన్‌కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తే భారీగా వచ్చే అవకాశాలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై చర్యలు చేపట్టింది.

పెండింగ్‌లో 40,042 వేలకు పైగానే దరఖాస్తులు

గతంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అరకొరగానే కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంకా జారీ చేయలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో 40,042 దరఖాస్తులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌లు విచారణ చేపట్టారు. దాదాపు 4200ల మంది అర్హులుగా తేల్చినట్లు అధికారులు చెబుతున్నారు. వివరాలు పౌర సరఫరాల శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విచారణ సమయంలో కొత్త కార్డులు వస్తాయని చాలా మంది దరఖాస్తుదారులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కార్డుల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్నారు. అదేవిధంగా కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిలో ఎవరైన మరణిస్తే వారి పేర్లను తొలగించేందుకు మాత్రం అవకాశం కల్పించింది. రేషన్‌కార్డుల్లో పేర్లు లేనివారికి ఏదైన ఆరోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత సేవలు పొందేందుకు సంబంధిత పత్రాలు సమర్పిస్తే కలెక్టరేట్‌లో అప్పటికప్పుడే వారి పేరిట కలెక్టర్ సంతకంతో తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కార్డుల జారీ

తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున నిరుపేదలందరికీ రేషన్‌కార్డుల భాగ్యం కల్పించింది. అప్పట్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులను జారీ చేసింది. అప్పట్లో రేషన్ దుకాణల ద్వారా అమ్మ హస్తం పథకం కింద రూ.185కే 9 రకాల నిత్యావసర సరుకులు రూ.1 కిలో బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి, కారంపొడి, నూనె తదితర సరుకులను పంపిణీ చేసేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెల్లరేషన్‌కార్డు ఆహార భద్రత కార్డుగా మారి కేవలం బియ్యానికే పరిమితం చేసింది.



ఎర్రాపహాడ్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

కేసులు ఎత్తివేయాలని పాడి రైతుల రాస్తారోకో

రాజంపేట, ఆగస్టు 10: విద్యుత్ అధికారులు తమపై నమోదు చేసిన కేసులకు నిరసనగా శనివారం తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలో పాడి రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులు మాట్లాడుతూ.. తాము షాప్ కట్టర్లను (గడ్డి కట్ చేసే మిషన్లు) విద్యుత్ వైర్లకు కొండీలు వేసి వాడుతుండడంతో ట్రాన్స్‌కో అధికారులు కేసులు నమోదు చేశారన్నారు. గత మార్చి నెలలో మండలంలోని 10 గ్రామాలకు చెందిన 40మంది పాడి రైతులు షాప్‌కట్టర్‌లు వినియోగించడంతో విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. దీంతో తామంతా విద్యుత్‌శాఖ ఎస్ఈని కలవగా.. తమపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ శనివారం ట్రాన్స్‌కో అధికారులు వచ్చి పెనాల్టీ కట్టాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని పేర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఎస్ఈ, ఏఈలకు ఫోన్‌లు చేయగా.. వారు అందుబాటులోకి రాలేదని రైతులు తెలిపారు. పశువుల దాణా కోసం షాప్ కట్టర్‌లను వినియోగిస్తే గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ రకమైన చర్యలు తీసుకోలేదని అన్నారు. కాగా.. రాస్తారోకోతో రోడ్డుపై ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలికి చేరుకొని రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు.

ఫారెస్ట్ క్లియరెన్స్ రాదు.. రోడ్డు నిర్మాణం జరగదు!

నిజాంసాగర్, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు ఫారెస్టు క్లియరెన్స్ లేక రోడ్డు నిర్మాణాలు జరగడం లేదు. ఫలితంగా నిధులున్నా ఏడేళ్లుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగకపోవడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. పాలకులు, అధికారులు మారుతున్నారు. ఎమ్మెల్యే, అధికారులు పనులు చేపట్టలేకపోవడంతో తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో టీఎస్పీ నిధుల కింద రూ.78లక్షలు గత ప్రభుత్వం మంజూరు చేసింది. చెరువు ముందర తండా మల్లూర్ రోడ్డు నుంచి 3.5 కిలో మీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా అప్పట్లో పూర్తి చేశారు. సదరు కాంట్రాక్టర్ రహదారిని వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అటవీ శాఖాధికారులు రహదారి అటవీలో ఉందని నిలిపి వేశారు. అటవీశాఖ క్లియరెన్స్ కోసం ఏడేళ్ల క్రితమే పనుల కోసం కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపినా ఇప్పటికీ క్లియరెన్స్ రాలేదు. రహదారి నిర్మాణానికి అప్పట్లో రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శంకుస్థాపన చేసిన శిలాఫలకం ధ్వంసమైంది. కల్వర్టుల నిర్మాణం కోసం తీసుకుని వచ్చిన పైపులు రోడ్డు పక్కన పడవేయడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.



చెరువు ముందర తండా రహదారి

తెలంగాణ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ రహదారికి నిధులు మంజూరైనా పాలకులు నిర్మాణం కోసం కృషి చేయలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. వర్షాలు కురిసాయంటే గిరిజన వాసులు ఈ రహదారి గుండా వెళ్లేందుకు అనేక పాట్లు పడుతున్నారు. గిరిజన ప్రాంతాల రహదారుల నిర్మాణానికి గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించినా ఇప్పటికీ పాలక యంత్రాంగం, అధికారులు చర్యలు చేపట్టలేక పోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి ఫారెస్టు అనుమతులు ఫారెస్టు క్లియరెన్స్‌కు చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.



రోడ్డు నిర్మాణానికి తీసుకుని వచ్చిన పైపులు



బీర్కూర్ మంజీరా నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా!

- హద్దులు దాటి, అనుమతికి మించి ఇసుక తవ్వకాలు
- హైకోర్టుకు బార్ అసోసియేషన్ లేఖ
- క్షేత్రస్థాయిలో అధికారుల విచారణ

బీర్కూర్, ఆగస్టు 10: బీర్కూర్ సమీపంలోని మంజీరా నదిలో గత కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు టీఎస్ఎండీసీ ద్వారా అనుమతులు ఇచ్చింది. అనుమతులను ఆసరాగా చేసుకుని సదరు కాంట్రాక్టర్లు మంజీరా నదిలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరిపి, రవాణా చేశారు. వందల కోట్ల రూపాయలు దర్జాగా సంపాదించుకున్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. క్వారీ నిర్వాహకుల నుంచి ముడుపులు తీసుకుంటూ పూర్తి సహాయ సహకారాలు అందించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆన్‌లైన్‌లో వే బిల్లులు పొందిన వారికే లారీలు, టిప్పర్‌లలో ఇసుక లోడ్ చేసి ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కారు. ఎలాంటి అనుమతులు లేకుండానే లారీలను, టిప్పర్‌లను రప్పించి నేరుగా ఇసుక లోడ్ చేసి అక్రమ రవాణాకు తెరలేపారు. ప్రతిరోజూ ఎన్ని లారీలు వస్తున్నాయి. ఇందులో వే బిల్స్ ఎన్ని ఉన్నాయి. ఎన్ని అనుమతులు లేకుండా వచ్చాయి అనే వివరాలు ఎస్ఆర్ఏ (సాండ్ రీచ్ అసిస్టెన్స్‌లు) తమ ఉన్నతాధికారులకు ప్రతిరోజూ చెప్పేవారు. దీనికి అనుగుణంగా క్వారీల నిర్వాహకులు అనుమతులు లేని ఒక్కో లారీకి మూడు వేల చొప్పున టీఎస్ఎండీసీ అధికారులకు ముట్టచెప్పేవారు. ఇలా ప్రతిరోజూ అధికారులకు లారీకి మూడు వేల చొప్పున 10 లక్షల నుంచి 20 లక్షల వరకు అందేవి. ఇదిలా ఉండగా అధికారులు ఒక్కో లారీకి మూడు వేల వసూలు చేస్తే అందులో నుంచి 500 రూపాయల సాండ్ రీచ్ అసిస్టెన్స్‌కు చెల్లించేవారని తెలిసింది. క్వారీ పాయింట్ వద్ద మంజీరా నది ఒడ్డున టీఎస్ఎండీసీ క్యాబిన్ ఏర్పాటు చేశారు. ఇందులో నలుగురు ఎస్ఆర్ఏలు విధులు నిర్వహించేవారు. ఇద్దరు క్యాబిన్‌లో మరో ఇద్దరు మంజీరానదిలో అనుమతులు లేని లారీలు లెక్కించే వారు. ప్రతీ క్వారీ పాయింట్ దగ్గర రెండు రహదారులు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన రహదారి గుండా వేబిల్స్ ఉన్న లారీలు వెళ్లేవి. మరో దారి గుండా వేబిల్స్ లేని లారీలు సీసీ కెమెరాలకు చిక్కకుండా వెళ్లేవి. మరో వైపు అనుమతులకు మించి ఇసుక తవ్వకాలు జరిపారు. మంజీరా నదిలో హద్దులు ఏర్పాటు చేసి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే హద్దులు దాటి ఇసుక తవ్వకాలు జరిపారు. దీంతో వందల కోట్ల రూపాయల విలువైన ఇసుకను కొల్లగొట్టారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. ఇలా పలు విధాలుగా ఇసుక అక్రమంగా రవాణా చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై బార్ అసోసియేషన్ ఫిర్యాదు

మంజీరా నది గుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై బిచ్కుంద బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టుకు లేఖ రాశారు. హైకోర్టు సుమోటోగా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంగా పరిగణలోకి తీసుకుంది. 30 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక కొల్లగొడితే 18 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక మాత్రమే మైనింగ్ చేశారని అధికారులు తప్పుడు రిపోర్టు ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు లేఖలో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు స్పందించి ప్రతివాదులుగా భూగర్భ, గనులు, రెవెన్యూ, హోం, రవాణా శాఖల ముఖ్య కార్యదర్శులకు గనులు శాఖ ఎం.డి.సహాయ డైరెక్టర్, కామారెడ్డి కలెక్టర్, ఎస్పీ, బిచ్కుంద తహసీల్దార్‌లను చేర్పించి. దీనిపై హైకోర్టు విచారణ చేపడుతుందని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

మంజీరా నదిలో అధికారుల విచారణ

అనుమతికి మించి ఇసుక తవ్వకాలు చేపట్టారని మంజీరా నదిని కొల్లగొట్టారని ఒక లాయర్‌తో పాటు, పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టుకు లేఖ రాశారు. హైకోర్టు నోటీసుల మేరకు జిల్లా కలెక్టర్ స్పందించి అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు గురువారం బీర్కూర్ సమీపంలోని మంజీరా నదికి విచ్చేసి విచారణ చేపట్టారు. గనుల శాఖ, నీటి పారుదల, రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డు, పోలీసు శాఖల అధికారులు మంజీరా నదిలో ఇసుక తవ్వకాల తీరును పరిశీలించారు. 2వ, 3వ క్వారీలో అనుమతికి మించి ఇసుక తవ్వకాలు జరిపారని అధికారులు గుర్తించారు. మంజీరా ఒడ్డున నిల్వ చేసి ఉంచిన ఇసుక నిల్వలను, క్వారీ దగ్గర ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. విచారణ అనంతరం రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే రికార్డు ఏడీ శ్రీనివాస్, డీఐ తిరుమలేష్, ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ లత, ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్, మైన్స్, పోలీసు అధికారులు తదితరులు ఉన్నారు.

క్వారీ నిర్వాహకుల నుంచి సొమ్ము రికవరీ చేయడం సాధ్యమేనా?

ప్రభుత్వ టీడీఎండీసీ ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం నిర్వాహకులకు అడ్డగోలుగా ఇసుక కొల్లగొట్టడం రివాజుగా మారింది. పాలకులు, అధికారుల అండదండలతో క్వారీ నిర్వాహకులు అడ్డగోలుగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి అక్రమ మార్గంలో వందల కోట్లు సంపాదించుకుంటున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అధికారులు కంటి తుడుపు చర్యగా విచారణ చేపడుతున్నారు. ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు అందజేసి అక్రమార్కులకు సహకరిస్తున్నారు. ఈ వ్యవహారం ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ సారైనా ఈ వ్యవహారానికి ఫుల్ స్టాప్ పెడతారో లేదో చూడాలి. క్వారీల నిర్వాహకుల నుంచి ఈ సారైనా అధికారులు, అక్రమార్కులు కొల్లగొట్టిన ఇసుక విలువను సరిగ్గా లెక్క కట్టి వారి నుంచి సొమ్ము రికవరీ చేస్తారా లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.



మంజీరా నదిలో వాహనాల్లో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

హన్మాన్ చాలీసా పారాయణం

డొంకేశ్వర్, ఆగస్టు 10 : సమాజంలో ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని కేదారేశ్వర్ ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా శనివారం ఉదయం డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో హన్మాన్ ఆలయంలో గ్రామస్థులు నిర్వహించిన హన్మాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. ప్రతీఒక్కరు భక్తి భావనతో నడుచుకొని భక్తితో ఉంటే మంచి పనులు చేయాలని ఆలోచనలు వస్తాయని తెలిపారు. హన్మాన్ చాలీసా యొక్క విశిష్ఠతను ప్రజలకు ఆయన వివరించారు. ప్రతీ శనివారం హన్మాన్ ఆలయంలో హన్మాన్ చాలీసా పారా యణం నిర్వహిస్తున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తా శ్రమ వ్యవస్థాపకుడు ఎనుగంటి నారాయణస్వామి, బీజేపీ సీనియర్ నాయ కులు మారంపల్లి గంగాధర్, లక్ష్మీనారాయణ, బాపురావు, సంతోష్, భూపతి, భోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఆగస్టు 10 : ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల నర్సింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతీ శనివారం ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

జంబి హనుమాన్ ఆలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 10 : పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతగా పన్‌గంటి లక్ష్మంబా సత్యనారాయణలు వ్యవహరించగా జంబిహన్మాన్ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జంబి హన్మాన్ ఆలయ కమిటీ చైర్మన్ గోర్త దేవేందర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు10: బోధన్ పట్టణంలోని ఆటోనగర్, కొత్తబస్టాండ్, శివాలయం, హనుమాన్ మందిరం తదితర ప్రాంతాలలో శనివారం నిరుపేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్వగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేసినట్లు బండారి సాయిచరణ్, శ్రావణిలు తెలిపారు. సామాజిక సేవకులు అశోక్‌కుమార్ రోడే, రమేష్ పోశెట్టి పాల్గొన్నారు.

నేడు ఐడీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

డిచ్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని రాంపూర్ రైతువేదికలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాంపూర్ విండో చైర్మన్‌గా కొనసాగుతున్న బాదవత్ తారాచంద్ నాయక్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నటు విండో కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆయా గ్రామాల మాజీసర్పంచ్‌లు, మాజీ ఎంపీ టీసీలు, విండో డైరెక్టర్‌లు, పాల్గొంటారని, సన్మాన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విండో రైతులు, డైరెక్టర్‌లు హాజరుకావాలని విండో కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

శెట్‌పల్లిలో రైతులకు వాటర్‌ఫిల్టర్ల పంపిణీ



వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న అధికారులు

మోర్తాడ్, ఆగస్టు 10 : మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో నలుగురు రైతులకు క్యూరీఫై వాటర్‌ఫిల్టర్‌లను పంపిణీ చేశారు. గత ఏడాది సజ్జ, మొక్కజొన్న దిగుబడిలో సజ్జ, మొక్కజొన్న పంటలు అధికంగా దిగుబడులు సాధించిన రైతులకు ప్రైవేటు సీడ్‌సంస్థ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, జగన్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ర్యాడే మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

● డీఎంహెచ్‌వో రాజశ్రీ


వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో

డిచ్‌పల్లి, ఆగస్టు 10 : ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. శనివారం డిచ్‌పల్లి ముప్పైపడకల ఆస్పత్రిని ఆమె సందర్శించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఆరోగ్యమేళా కార్యక్రమానికి స్త్రీవైద్య నిపుణురాలు సుశ్మ, దంత వైద్యనిపుణులు సరిత గ్రేస్ హాజరై రోగులకు మంచి సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే గైనకాలజీ సమస్యలపై స్కానింగ్ చేసి చికిత్స అందించాలని రాజశ్రీ పిలుపునిచ్చారు. ఆరోగ్యమేళాలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, వేణు గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా కోనాపూర్ రహదారి


అధ్వానంగా మారిన కోనాపూర్ ప్రధాన రహదారి


బురదమయమైన రోడ్డు

● చిరుజల్లుకు చిత్తడి.. చిత్తడి..
● బురదలో కూరుకుపోతున్నవాహనాలు
● ఇబ్బందులు పడుతున్నగ్రామస్తులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని కోనాపూర్ ప్రధాన రహదారి చిరుజల్లుకే చిత్తడిగా మారి ప్రయాణం సాహసోపేతంగా మారింది. గ్రామస్తులు పొరుగు గ్రామాలు (జగిత్యాల జిల్లా) కోరుట్ల, ఖతలాపూర్, భూషన్‌రావుపేట్‌కు వెళ్లాలన్నా చివరకు తమ పంట పొలాలకు వెళ్లాలన్న ఈ రహదారిపై సాహసోపేత ప్రయాణాలు తప్పడం లేదు. మండలంలోని నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్‌నగర్, కోనాపూర్ గ్రామం వరకు బీటీరోడ్డు రెన్యూవల్ నిమిత్తం నాన్‌ప్లానింగ్ పథకంలో రూ.3 కోట్ల 16 లక్షలు, నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్‌నగర్, కోనాపూర్ గ్రామం మీదుగా జగిత్యాల జిల్లా భూషన్‌రావుపేట్ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిమిత్తం ఎస్సీ ఎస్డీఎఫ్ నిధుల నుంచి 65 కోట్ల 20 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు 13 జూలై 2023లో శంకుస్థాపన చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ గ్రామానికి రెండు వైపుల రోడ్లను చదునుచేసి మధ్యలో కంకరపోసి వదిలేశాడు. బీటీ నిర్మాణ పనులకు కొంత జాప్యం అయింది. మరోవైపు అదే సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు మరుగునపడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం


మొక్కలు నాటుతున్న కాలనీకమిటీ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 10 : పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛదనం - పచ్చదనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యుల సహకారంతో వివిధ రోడ్లలో మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సంబంధిత ఇంటి యజమానులకు సూచించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు సుంకెశ్రీనివాస్, పుప్పాల శివరాజ్, కమలాకర్, సత్యనారాయణగౌడ్; కొక్కెర భూమన్న, సాయన్న, కొంతం రాజు, గడ్డం శంకర్, గణేష్, ఖదీర్, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకికొండ చుట్టు ప్రదక్షిణ చేయించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


మాట్లాడుతున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి

జక్రాన్‌పల్లి, ఆగస్టు 10 : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అర్గుల్ గ్రామంలో రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాంలు కలిసి పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతు కుంట రాజేష్ భూమి ధరణిలో నమోదు కాకపోవడం, చేసిన అప్పులు తీర్చలేక రైతు కుంట రాజేష్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ధరణిలో రైతుల భూములు నమోదు కాకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారన్నారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి రైతు కుంట రాజేష్‌ను ఇబ్బందులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధానకార్యదర్శి బి.దేవరాం, జిల్లా అధ్యక్షుడు సూర్య సురేష్, నాయకులు బాబన్న, తలారి గంగారాం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సం ఘం రాష్ట్ర నాయకుడు గంగాధర్, దేవన్న, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

బోధన్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు


సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

బోధన్ రూరల్, ఆగస్టు 10 : బోధన్ పట్టణంతో పాటు ఎడపల్లి, బోధన్, ఇతర మండలాల్లో ఉన్న సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ జెనర్థీ తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం విద్యుత్ అందించాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్య ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. రైతులు, ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

పంచాయతీ రాజ్ కార్యాలయానికి కోటగిరి ఎంపీడీవో అటాచ్

కోటగిరి, ఆగస్టు 10 : కోటగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని పంచాయతీ రాజ్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అనారోగ్య కారణాలతో ఎంపీడీవో సెలవులో వెళ్తున్నట్లు అధికారులు ప్రకటించినా ఆయన బదిలీ వెనుక రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలిసింది. ఏడాదిన్నర క్రితం కోటగిరి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ రెడ్డి మండలంలో అన్ని రాజకీయాలను కలుపుకుని అభివృద్ధికి కృషిచేశారు. ఇటీవల మండలంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో ఎంపీడీవో బదిలీకి ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఓ నాయకుడికి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన బదిలీకి ప్రయత్నించారని మండలంలో చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం కోటగిరి ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న చందర్‌కు కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం

వేల్పూర్, ఆగస్టు 10 : వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి వలస వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్టు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మహరాష్ట్రకు చెందిన జైపాల్ హన్మంత్‌రావు తన భార్య ఆశరాణితో కలిసి వచ్చి జాన్కంపేట్ గ్రామానికి నెల రోజుల క్రితం వలస వచ్చి కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో భార్యతో గొడవపడిన హన్మంతురావు భార్యకు చెప్పకుండా వెళ్ళిపోయాడు. వారి బంధువుల ఇళ్ళలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని, భార్య ఆశరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. హన్మంతురావు ఇంట్లో నుంచి వెళ్ళినప్పుడు ఎర్రచొక్క, జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ దొరికనట్లతే 8712659862 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బోధన్‌లో ఎస్ఐల బదిలీలు

బోధన్‌రూరల్, ఆగస్టు 10 : బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఐ నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ అయ్యారు. కమ్మర్‌పల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ బోధన్ రూరల్ ఎస్ఐగా బదిలీపై రానున్నారు. అలాగే బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామారావు బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లారు. బోధన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మచ్చేందర్ రెడ్డితో పాటు మరో ఎస్ఐ త్వరలో విధుల్లో హాజరుకానున్నారని ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు శాఖలో బదిలీలు సహజమేనని ఎక్కడ ఉన్న మంచి నిబద్ధతతో పని చేసి పేరు సంపాదించుకోవాలన్నారు. శాంతిభద్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

'కుక్కల బెడదను తీర్చండి'


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు

బోధన్‌రూరల్, ఆగస్టు 10 : బోధన్ పట్టణంలో రోజురోజుకు కుక్కల బెడద అధికం అవుతుందని, కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేట్టాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణంలో కుక్కలు విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూ అందరిని కరుస్తున్నాయని, బోధన్ మున్సిపల్ యంత్రాంగం కనీసం గాయాలపాలైన వారిని పరామర్శించకపోవడం, చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వర్షాకాలంలో రోడ్లు పాడై గుంతలు పడుతున్నా గుంతలు పూడ్చడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందని ఆరోపించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మున్సిపల్ యంత్రాంగంతో రివ్యూ మీటింగ్ నిర్వహించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాం, కౌన్సిలర్ సత్యం, సీనియర్ నాయకులు మహ్మద్ రజాక్, కార్మిక విభాగం అధ్యక్షులు రవి శంకర్ గౌడ్, ప్రవీణ్ నాయక్, హైమద్, సాగర్, షేక్.జాకీర్ ఉన్నారు.

టీడీపీ నాయకుడిని కలిసిన జనసేన


తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిని కలిసిన జనసేన నాయకులు

బోధన్ రూరల్, ఆగస్టు 10 : తెలుగుదేశం నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్ రావును శనివారం బోధన్ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ శివ, జనరల్ సెక్రెటరీ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు హన్మంత్‌రావుతో కలిసి రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగరాజు, షేక్.మహ్మద్, గణేష్‌గౌడ్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై జ్వర సర్వే


బాల్కొండలో నిల్వ ఉన్న నీటిలో దోమల మందు పిచికారి చేస్తున్న వైద్యసిబ్బంది

ముప్కాల్, ఆగస్టు 10 : బాల్కొండ మండలంలోని పోచమ్మగల్లీలో శనివారం వైద్య సిబ్బంది జ్వరసర్వే నిర్వహించారు. అనంతరం పోచమ్మగల్లీలో దోమల మందు పిచికారి చేశారు. అపరిశుభ్రంగా ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందినా రోగాలు బారినపడే అవకాశం ఉందని, ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మరియమ్మ, ఆశవర్కర్‌లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్‌మేళా


ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్‌మేళాలో చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మోర్తాడ్, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ హెల్త్‌కమ్యూనిటీ సెంటర్‌లో జిల్లా వైద్యాధికారులు హెల్త్‌మేళా నిర్వహించారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం హెల్త్‌మేళా నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులు, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యుడు డాక్టర్ రాజేష్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జోత్స్న, ఫార్మాసిస్టు సంజీవ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వినియోదారుల అభిరుచులకు

అనుగుణంగా వ్యాపారం చేయాలి

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10: ఫ్యాషన్ ప్రపంచంలో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, మార్కెట్ పోటీని తట్టుకుంటూ వ్యాపారం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం కామారెడ్డి క్లాత్ మార్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. వస్త్ర వ్యాపారంలో విపరిత ధోరణి ఏర్పడిందని, వ్యాపారం చేయాలంటే పోటీని తట్టుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లాలో బాగా వర్షాలు కురిసి పంటలు పండినప్పుడే వస్త్ర వ్యాపారం బాగుంటుందన్నారు. మూడు నెలలుగా శుభకార్యాలు లేక గిరాకీలు లేవన్నారు. తన తల్లిదండ్రుల పేరిట కామారెడ్డి బట్టల వర్తక సంఘ భవానానికి తగిన విధంగా విరాళం అందిజేస్తానని, స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సహకారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై సాయికుమార్

యువకులు క్రీడల పట్ల దృష్టి సారించాలి

భిక్కనూరు, ఆగష్టు 10: యువకులు చదువుతో పాటుగా క్రీడల పట్ల దృష్టి సారించాలని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ అన్నారు. శనివారం భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగౌడ్‌సాబ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మండలస్థాయిలో ఇలాంటి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుందు మరిన్న టౌర్నమెంట్‌లను నిర్వహించి గ్రామీణ యువకుల్లో దాగిఉన్న ప్రతిభను బయటకు తీయాలని అందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహాకులు చంద్రశేఖర్‌గౌడ్, సంజయ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



చిరంజీవులు (ఫైల్)

ఎల్లారెడ్డి, ఆగస్టు 10 : విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన పట్టణ పరిధిలోని లింగారెడ్డిపేట్ శివారులో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డిపేటకు చెందిన మామిడి చిరంజీవులు(54) ఆయన భార్యతో కలిసి పొలానికి మందు చల్లడానికి వెళ్లారు. మందు చల్లుతుండగా దాహం వేయడంతో బోరు మోటారు స్టార్ట్ చేసి నీరు తాగుదామని బోర్ మోటార్ వద్దకు వెళ్లి చూడగా స్టార్ బాక్సు పని చేయకపోవడంతో సరి చేయడానికి పక్కన ఉన్న ట్రాన్స్‌పార్మర్ జంపర్ కొట్టి విద్యుత్‌ను ఆఫ్ చేస్తుండగా జంపర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవ శాత్తు అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మొదటి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.

నేడు జనగామాలో రక్తదాన శిబిరం

దోమకొండ, ఆగస్టు 10: బీబీపేట మండలంలోని జనగామ గ్రామంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త, విద్యావేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన ఇంటి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసేందుకు 140 మంది ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఉదయం నుంచి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

గురుకుల పాఠశాల క్యాప్టెన్‌గా శిరీష

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 10: మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం కౌన్సెలింగ్ ఎన్నికలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను శనివారం ప్రకటించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. పాఠశాల క్యాప్టెన్‌గా శిరీష, వైస్ క్యాప్టెన్‌గా అక్షయ, స్పోర్ట్ క్యాప్టెన్‌గా స్రవంతి, లిటరసీ క్యాప్టెన్‌గా స్పందన, కల్చరల్ క్యాప్టెన్‌గా హర్షిణీలు ఎన్నిక అయినట్లు తెలిపారు, ఈ విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో వీరు సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగరాణి, రాములు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కల్కి చెరువు శిఖం భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● బాన్సువాడ మండల బీజేపీ నాయకుల డిమాండ్



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న బాన్సువాడ బీజేపీ నాయకులు

బాన్సువాడ, ఆగస్టు 10: బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువు శిఖం భూములను కబ్జా చేసిన రియల్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాన్సువాడ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కల్కి చెరువు కట్ట శిఖం భూముల కబ్జా చేసిన వెంచర్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని శిఖం భూమి, గ్రామ కంఠం భూమి, బఫర్ జోన్ భూమి, టెన్ పర్సెంట్ భూమి, కబ్జాలు చేస్తూ యథేచ్ఛగా వెంచర్లు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేసినా మామూళ్ల మత్తులో, రాజకీయ ఒత్తిళ్లకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. మున్సిపల్ అధికారులు ఇల్లు లేకపోయినా ఇల్లు ఉన్నట్లు ఇంటి నెంబర్లు ఇస్తున్నారన్నారు. బాన్సువాడలో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన వెంచర్లు ఫైనల్ లే అవుట్ కాకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు అలాంటి వెంచర్లపై చర్యలు తీసుకోకుండా వెంచర్లలో కనీస సౌకర్యాలు లేనప్పటికీ ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల ప్లాట్లు కొన్న ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఫైనల్ లే అవుట్ కాకుండా రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ప్లాట్లు కొన్న ప్రజలు మున్సిపాలిటీకి ఇంటి నిర్మాణానికి పర్మిషన్‌కి వెళితే తిరస్కరిస్తున్నారన్నారు. కావున ఫైనల్ లే అవుట్ కాని వెంచర్లపైన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుడ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, బీజేపీ పట్టణ కార్యదర్శి పాశం భాస్కర్‌రెడ్డి, కోనాల గంగారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

● నిందితులపై హత్యా యత్నం చోరీ కేసులు నమోదు
● నిందితుడు ఇప్పటికే హత్యకేసులో జైలుకు వెళ్లి బెయిల్ పై విడుదల



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

లింగంపేట, ఆగస్టు 10: మండలంలోని కన్నాపూర్ శివారులో గురువారం అర్ధరాత్రి ఇన్నోవా డ్రైవర్‌ను హత్యాయత్నం, వాహనం చోరీ చేసి పారిపోయిన నిందితులను పోలీసులు 24 గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులను శనివారం డీఎస్పీ శ్రీనివాసులు లింగంపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. దారిబోయిన శ్రీకాంత్ అతని భార్య అనితలు హైదరాబాద్‌లోని బాల్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు డీఎస్పీ తెలిపారు. శ్రీకాంత్ అల్లాపూర్ ప్రాంతంలో ఒక హత్య కేసులో జైలుకు వెళ్లి నెల రోజుల క్రితం బెయిల్‌పై వచ్చాడని అతనిపై ఇప్పటికే ఏడు చోరీ కేసులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. శ్రీకాంత్ జైలులో ఉండగానే స్టీవెన్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఒక చోరీ కేసులో జైలుకు వెళ్లగా అక్కడ శ్రీకాంత్ పరిచయమయినట్లు ఆయన తెలిపాడు. జైలు నుంచి విడుదలయిన అనంతరం ఇద్దరు సంబంధాలను కొనసాగించారని ఆయన అన్నారు. జులాయిగా తిరిగే శ్రీకాంత్ సులభంగా డబ్బు సంపాదన కోసం తన భార్య అనితతో కలిసి స్టీవెన్‌ను హత్య చేసి వాహనంతో పారిపోవాలని పథకం వేసినట్లు తెలిపాడు. ఈనెల 8న రాత్రి తమ స్వగ్రామమైన కన్నాపూర్‌కు వెళ్లాలని స్టీఫెన్ వాహనాన్ని కిరాయికి మాట్లాడుకుని హైదరాబాద్ నుంచి బయలు దేరినట్లు తెలిపారు. మెదక్ పట్టణంలో భోజనాలు చేసి తిరిగి బయలు దేరారని మండలంలోని కన్నాపూర్ గ్రామం శివారులోకి వచ్చిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకుంటామని చెప్పగా డ్రైవర్ వాహనం ఆపినట్లు తెలిపారు. డ్రైవర్ మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో పథకం ప్రకారం శ్రీకాంత్ డ్రైవర్ స్టీఫెన్‌పై దాడి చేయగా కిందపడిన వెంటనే శ్రీకాంత్ భార్య స్కార్ఫ్‌ను మెడకు చుట్టి చంపాలని ప్రయత్నం చేసినట్లు తెలిపారు. స్టీఫెన్ అపస్మారక స్థితికి చేరడంతో మృతి చెందినట్లు భావించిన నిందితులు స్టీఫెన్‌కు సంబంధించిన సెల్‌ఫోన్‌లు, ఐడీకార్డులతో పాటు ఇన్నోవా వాహనంతో పరారైనట్లు ఆయన తెలియజేశారు. స్టీఫెన్ కొద్దిసేపటి తరువాత తేరుకొని 100కు డయల్ చేయడంతో కేసు నమోదు చేసుకుని సెల్‌ఫోన్ సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం నిందితులను పట్టుకున్నామని, వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా చేదించిన సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై చైతన్యకుమార్‌తో పాటు పోలీస్ సిబ్బందికి ఎస్పీ సింధూశర్మ క్యాష్ రివార్డును ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి తూట్లు

● పెంటకుప్పల మధ్య అంగన్‌వాడీ కేంద్రం



బీర్కూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూరా పెంటకుప్పలున్న దృశ్యం

బీర్కూర్, ఆగస్టు 10 : గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో ఐదు రోజుల పాటు స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండల కేంద్రంలో మాత్రం ఈ కార్యక్రమం విజయవంతంగా చేపట్టలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీర్కూర్‌లో ఒక అంగన్‌వాడీ కేంద్రం చుట్టూరా పెంటకుప్పలు ఉన్నాయి. దీనికి తోడు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చెత్తాచెదారం చేరింది. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు కేంద్రం చుట్టూరా పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను పెంటకుప్పలను తొలగించాలని గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కేంద్రానికి వచ్చే పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంటకుప్పలు, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం వల్ల దోమలు, ఈగలు, విష కీటకాలు వ్యాప్తి చెందుతున్నాయని పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు అధికారుల నిర్లక్ష్యం పిల్లల ప్రాణాల మీదకి వస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూరా పేరుకుపోయిన చెత్తను, పెంట కుప్పలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



భారీగా క్యూకట్టిన భక్తులు

లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి

మాచారెడ్డి, ఆగస్టు 10: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. పుట్టు వెంట్రుకలు, వాహనపూజలు, సహస్రనామార్చన, ఓడిబియ్యాలు, గండదీపాలు నిర్వహించి భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమాలకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

రామారెడ్డి, ఆగస్టు 10: రామారెడ్డి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్ల పంపిణీ చేపట్టారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పండ్ల పంపిణీ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, నర్సింలు, బ్రుదం, కిషన్, అనిఫ్,మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సభ విజయవంతానికి సమీక్ష నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిచ్కుంద సభను విజయవంతం చేయండి

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 10: బిచ్కుంద మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న వర్గీకరణ విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు గాను శనివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడంతో ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపేందుకు గాను సభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని మాదిగ సోదరులతో పాటుగా వారి ఉప కులాలైన వారు ఈ సభకు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామారెడ్డి, ఆగస్టు 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1993-94 పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాలలో చదివిన జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమీషనర్ డాక్టర్ సునందరెడ్డి చిన్ననాటి స్నేహితులతో కలిసి మొక్కను నాటారు. ఆనాటి మధురస్మృతులను తలుచుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లింగం, రమేష్, ప్రభాకర్, రమేష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

టీటీడీలో సుదర్శన యాగం



టీటీడీలో సుదర్శన యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం దంపతులు

బీర్కూర్, ఆగస్టు 10: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన భగవానుని తిరు నక్షత్రం సందర్భంగా ఆలయ సన్నిధిలోని యాగశాలలో సుదర్శన యా గం నిర్వహించారు. సుదర్శన యాగంలో ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులు, పోచారం శంభురెడ్డి, ప్రమీళ దంపతులు పాల్గొని యాగాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా రైతునగర్ గ్రామ ప్రజలు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్ జిల్లా మల్లంపేట్ గ్రామానికి చెందిన ఒక భక్తుడు ఆరు తులాల వెండి కిరీటాన్ని స్వామి వారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, నరసరాజు, మురళి, సత్యనారాయణ, సాయిబాబు, హనుమంతరావు, ఆలయ కమిటీ మేనేజర్ విఠల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

స్వచ్ఛదనం - పచ్చదనం పై వ్యాసరచన పోటీలు

బాన్సువాడ టౌన్, ఆగస్టు 10: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో శనివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛదనం - పచ్చదనం పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛత, పచ్చదనం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాల్యం నుంచే విద్యార్థులు స్వచ్ఛత, పరిశుభ్రత అంశాలపై పట్టు సాధించాలని, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత వల్ల ఎలాంటి రోగాలు కూడా దరిచేరవన్నారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వసీ, సాయికుమార్, కవిత, మౌలానా తదితరులున్నారు.



బ్రహ్మకుమారీలు రాఖీ కడుతున్న దృశ్యం

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్

భిక్కనూరు, ఆగస్టు 10: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, గ్రామపంచాయితీ సిబ్బందికి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారీ కామారెడ్డి ఇంచార్జి జయ మాట్లాడుతూ రక్షాబంధన్ గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రోజారాణీ, గంగాదేవి, చంద్రకళ, వసంత, తదితరులు పాల్గొన్నారు.



తిప్పాపూర్‌లో వీడీసీ కమిటీని ఎన్నుకుంటున్న దృశ్యం

తిప్పాపూర్ వీడీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, ఆగష్టు 10: మండలంలోని తిప్పాపూర్ గ్రామాభివృద్ధి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొండ సిద్ధరాములు, ఉపాధ్యక్షులుగా నారిగల్ల రాజు, మధుకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా బాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్యామర్తి జీవన్‌లను గ్రామస్థులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అన్నివర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో భక్తుల పూజలు



అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, ఆగస్టు 10: పట్టణంలోని పెద్దహనుమాన్ మందిరం, గౌలిగూడ, పాత బాన్సువాడ, శ్రీరామ మందిరాల్లో శనివారం భక్తులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అర్చకులు ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు , అర్చనలు చేపట్టి సింధూరంతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. శ్రీరామ ఆలయంలో మద్యాహ్నం భక్తుల కోసం ధూశెట్టి రాజు కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కర్యాక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు తదితరులున్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

